TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

# 'తెలంగాణ' అంశాలపై చర్చించాలి

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో **25.01.2014,** శనివారం సాయంత్రం హిమాయత్‌నగర్ లోని చంద్రం భవన్‌లో ఈ వారం **'అసెంబ్లీలో తెలంగాణ ముసాయిదా బిల్లు–శాసనసభ్యులు చర్చించవలసిన అంశాలు'** అనే అంశంపై 106వ చర్చా కార్యక్రమం జరిగింది. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఈ చర్చా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ చర్చా కార్యక్రమంలో వక్తలుగా సీనియర్ జర్నలిస్ట్ సతీష్ చంద్ర, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, టీపీఎఫ్ ప్రధాన కార్యదర్శి నలమాస కృష్ణ, టీజేఎఫ్ ప్రతినిధి పల్లె రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ జోనల్ కమిటీ సభ్యుడు ఆర్.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పాశం యాదగిరి మాట్లాడుతూ, చట్టసభల్లో బిల్లులోని అంశాల పై గాకుండా, అందులో లేని అంశాలపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులు ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారని, ఇతరుల వాదనలకు బదులిచ్చేందుకు మాత్రమే వారు ప్రాధాన్యం ఇస్తున్నారని ఫలితంగా బిల్లులోని అంశాలు చర్చకు రాకుండా పోతున్నాయని అన్నారు. ఈ విధమైన ధోరణి వల్ల ఇటు తెలంగాణ ప్రజలకు మాత్రమే గాకుండా సీమాంధ్ర ప్రజానీకానికి అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశాల గడువు తేదీలను పొడిగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండబోదని స్పష్టం చేశారు. చట్టసభల్లో గతంలో కూడా చర్చలు సజావుగా జరిగిన దాఖలాలు లేవని, ఎన్నో కీలక పద్దులు గిలెటిన్ అయిన దాఖలాలు ఉన్నాయన్నారు.

సతీష్ చందర్ మాట్లాడుతూ, గతంలో పార్టీల వారిగా సభ్యుల మధ్య వాదనలు ఉంటే, ఇప్పుడు ప్రాంతాలవారీగా వాదనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాజ్యాంగహోదాలో ఉన్న వ్యక్తులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అలా గాకుండా కొంతమంది దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. చట్టసభల్లో చర్చ అంతా కూడా ఒక రాజకీయ క్రీడగా జరుగుతోందన్నారు. తెలంగాణతో పాటుగా సీమాంధ్రలో కూడా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ద్విపాత్రాభినయం చేస్తోందని విమర్శించారు. దీన్ని బయటపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గవర్నరు అధికారాలు లాంటి కీలక అంశాలు చర్చకు రావడం లేదన్నారు. మరో వంకన బీజేపీ సవరణలు ప్రతిపాదిస్తోందన్నారు. షరతులు లేని తెలంగాణ కోసం, ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ ఏర్పడేందుకు ఈ ప్రాంత ఎమ్మెల్యేలు కృషి చేయాలని సూచించారు.

ఆమ్ ఆద్మీ నాయకుడు ఆర్. వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాదృక్పథం లేని వారు సభల్లో ఉంటే ప్రజలకు న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలు ఆయా అంశాలను చర్చించేలా ప్రజా సంఘాలు లాంటివి ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

TELANGANA
**RESOURCE CENTRE**

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రేపటి తరాలకు సమాధానం ఇచ్చుకోలేని చారిత్రక తప్పిదాన్ని ప్రజాప్రతినిధులు చేస్తున్నారన్నారు. ముసాయిదా బిల్లుపై చర్చ జరగకుండా చర్చను పక్కదోవ పట్టించే యత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు ఏ ఒక్క పార్టీ కూడా మినహాయింపు కాదన్నారు. ఉమ్మడి రాజధాని, పెన్షనర్లు, ఉన్నత విద్య, న్యాయ వ్యవస్థ, గవర్నర్ అధికారాలు తదితర అంశాల గురించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో టీఆర్‌సీ చైర్మన్ వేదకుమార్, చందా రాములు, డి.పి.రెడ్డి, కోటా రాజేష్, ముత్యం రెడ్డి, ప్రకాష్, దొమ్మాట వెంకటేష్, కొమ్మిడి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బోనకుర్తి సోమేశ్వర్**

**కో-ఆర్డినేటర్, టిఆర్‌సి**